# సుగంధ తరువు

రంగధామ



భైరవపురం పల్లె గాని, పట్టణంగాని మధ్యరకం గ్రామం. ఆ గ్రామంలోని ప్రజలకు దైవభక్తి, పాపచింతనా కల్గిద్దామనే సదుద్దేశంతో, తద్వారా వారిని తరింప జెయ్యాలనే మహదాశయంతో రాఘవ శాస్త్రిగారు ఒకనాటి సాయంకాలం, ఆవూరికి వచ్చే ఏలూరు బస్సులోంచి దిగారు. సత్రంలో మకాంచేసి, మర్నాడు ప్రొద్దున్న ఆ వూళ్ళోని పెద్దల్ని కలుసుకుని తన పురాణం ఏర్పాటు చేయించమని కోరడానికి బయల్దేరారు.

ఆ వూళ్ళో బాగా ధనికుడైన కృష్ణమనాయుడుగారు వూళ్ళో లేకపోవడం, మరో పెద్దమనిషి సుబ్బారావుగారికీమధ్య వంట్లో బాగులేకపోవడం, పంచాయితీ ప్రెసిడెంటు రామయ్యగారికీ రాబోయే ఎన్నికల హడావుడితో తీరుబాటు లేకపోవడం వల్ల, తన పురాణం చెప్పించే నాథుడే కన్పించలేదు రాఘవశాస్త్రిగారికి. ఆయన గొప్ప పౌరాణికుడు. రామాయణం చెప్పడంలో దిట్ట. సంస్కృత పాండిత్యమే కాక సంగీతంలో మంచి ప్రవేశం కలవాడు. వయస్సు నలభైకి దగ్గరలో ఉంటుంది. చక్కని వంకీలు తిరిగిన క్రాపింగు, మధ్య పాపిట తీసి దువ్వబడి, ఆయన ముఖానికి ముఖ్యాకర్షణలా, వత్తుగా నిగనిగ లాడుతూ ఉంటుంది. నుదురు విశాలమైనా, కనుబొమలు కొంచెం లోపలికి పోయినట్లుండి, పళ్ళెత్తు కావడం వల్ల, నవ్వితే ఆయన మొహం గాజుకప్పు మధ్యకి పగిలినట్లుంటుంది. కళ్ళు పెద్దవే గాని, గోల్డు రిమ్ కళ్ళజోడు వెనకాల మరింత పెద్దవిగా కన్పించి కొంచెం వికృతంగా ఉన్నట్లుంటాయి. మనిషి రంగు ఎరుపే, పొట్టిగా, చిన్న బొజ్జతో, ఖద్దరు పంచె, చొక్కా పైమీద ఇస్త్రీ వోణితో మొత్తానికి చూసిన వారికి ఒక సంగీత విద్వాంసుడిలా స్ఫురిస్తాడు. అతన్ని చూసి ఎవరూ పౌరాణికుడనుకోరు. దువ్వని గుండుమీద పిలక పెట్టుకుని పైన చొక్కా లేకుండా, సనాతన సాంప్రదాయంలో పురాణాలూ, హరికథలూ చెప్పడం చాలామంది మానేస్తున్నారు కాబట్టి అదొక విశేషం కాదనీ, అసలా మాటకొస్తే తను చెప్పేది రామాయణ ఉపన్యాసమనీ ఆయన అంటూంటే వారు. వినేవాళ్లెవరూ దానికి అడ్డంతరం పెట్టలేదు.

రెండు రోజులు తిరగ్గా తిరగ్గా చివరికి ఆ వూళ్ళో సత్యంగారనే ఒక ఆసామి, తన యింటి సావిట్లో పురాణం చెప్పించడానికి అంగీకరించారు. అంతేకాకుండా, భైరవపురంలోని ఒక ఆయుర్వేద డాక్టరుగారు ఆయనకు అన్నివిధాలా సహకరించదల్చాడు, తను రామభక్తుడవడంవల్ల. ఆయన పేరు శివరావుగారు. పొడుగ్గా, కొంచెం వంగిన నడుంతో నడుస్తూంటారు. పొడుగాటి ముక్కు, కోల మొహంతో గంభీరంగా కన్పిస్తారు. వయస్సు అరవై దాటింది. లోకంలోనూ అందులోనూ భైరవపురంలోనూ పాపం విపరీతంగా పెరిగిపోయిందనీ, ఇలాంటి సత్కాలక్షేపం ప్రజలకు చాలా అవసరం అని శివరావుగారూ, సత్యంగారూ ఆలోచించారు. తనకి కొంచెం ఇబ్బంది కలిగినా, పురాణానికి ఎంతోమంది జనం రావచ్చు, అయినా నాలుగు రోజులే కదా అని, అందువల్ల తను సహించాలనే అభిప్రాయం సత్యంగారికుంది.

పురాణం ప్రారంభమైంది. రెండు రోజులు జరిగేసరికి పురాణం బాగా చెప్తున్నారనే సంగతి వూళ్ళో వ్యాపించింది. రోజురోజుకూ శ్రోతల సంఖ్య పెరగసాగింది. మొదట్లో శివరావుగారు తనకు కలిగించిన నిరాశ ఫలితంగా, పురాణం తొందరగా ముగించేద్దామనుకున్న శాస్త్రిగారు, రెండు రోజుల్లో ప్రజలలో వ్యాపించిన ఉత్సాహం చూసి, మెయిలు బండి స్పీడు నుంచి పురాణాన్ని ఒంటెద్దు బండి నడకకు దింపేశారు. తత్ఫలితంగా వారం రోజు లయ్యేసరికి, పురాణం బాలకాండ కూడా పూర్తికాలేదు. అహల్యా శాప విమోచన ఘట్టమే ఒక రోజంతా చెప్పారు. రోజురోజుకీ ఎక్కువవుతున్న జనాన్ని చూసి సత్యంగారు ఒక విధంగా సంతోషించినా, మరోకవిధంగా విచారించి, వారం రోజుల కన్నా ఎక్కువకాలం తను సావిడి ఇవ్వలేమని చెప్పేశారు. రాఘవ శాస్త్రిగారు ఆఖరి రోజున పురాణం ఇలా ముగిసిపోవలసిందేనా,

అని దిగులు పడేసరికి, సభలోని కొందరు వెంటనే నడుంకట్టి, ఆ వూళ్లోని రామాలయంలో మర్నాటికి అన్ని ఏర్పాట్లూ చేస్తామని హామీ యిచ్చారు. సత్యంగారు శాస్త్రిగారికి పంచెల చాపిచ్చారు ఆరోజున. శివరావుగారు, శాస్త్రిగారి అనుమతిపై పది నిముషాలు మాట్లాడుతానని, అర గంటసేపు ఉపన్యాసం యిచ్చారు. అందులో శివరపురం పుట్టుపూర్వోత్తరాలన్నీ చెప్పుకు వచ్చి, వూళ్లో పెరిగిపోతున్న అవినీతి తగ్గాలంటే ప్రజలంతా, పురాణానికి విధిగా హాజరవ్వాలని, ఇంకా ఏవేవో తనకు తోచిన మంచివాక్యాలు చెప్పారు. మరో ఇద్దరు కూడా శాస్త్రిగారిని పొగుడూ కొంచెం సేపు ఉపన్యాసం ఇచ్చారు. అందులో ఒకా యన గంగరాజుగారని ప్రముఖ వర్తకుడు. మొత్తానికి ఆ రోజుతో సత్యంగారి బరువు తీరిపోయింది.

మర్నాడు, రామాలయంలో కొత్తగా వేయించిన విశాలమైన పందిరిలో, మైకు ఏర్పాటులతో, పురాణం ప్రారంభమైంది. శాస్త్రిగారికి మంచి వాగ్ధాటి వుంది. కంచులా ఖంగుమని మ్రోగే గొంతుక వుంది. ఆకర్షకంగా చెప్పగల శక్తి వుంది. అప్పుడప్పుడు కొన్ని పిట్టకథలూ, చమత్కార ప్రయోగాలూ చెప్తూ సభారంజకంగా పురాణం సాగిస్తారు. రోజు సాయంకాలం ఆరు గంటలకు ప్రారంభమయ్యే పురాణ కాలక్షేపం ఊళ్లో అన్నివర్గాలవారినీ ఆకర్షిస్తూ రాత్రి తొమ్మిది, పది గంటల దాకా సాగుతూండేది. వచ్చిన ప్రజానీకం అంతవరకూ ఎంతో ఓపికగా వినేవారు.

ఇటువంటి కాలక్షేపాలు కొత్త వయసు మళ్లిన వారినే ఆకర్షిస్తాయనే అభిప్రాయం కొందరికుంది. కాని ఈ రామాయణ కథాగానానికి వయసులో వున్న ఆడవారే కాక, పెళ్లికాని అమ్మాయిలు కూడా ఎంతో రావడం మొదలెట్టారు. వాళ్లలో భక్తి అలా పెరిగిపోతూంటే తాము వెనుకంజ వెయ్యకూడదని, యువకులు కూడా చాలామంది యథాశక్తి కాలక్షేపానికి హాజరు కాసాగారు. పురాణంలో శ్రవణమే ముఖ్యం

# సుగంధతరువు

కాబట్టి చెవుల్ని పురాణానికి అప్పజెప్పేసి, కళ్లను మాత్రం తమకు కావలిసిన వాటి కోసం వెదుక్కోనిచ్చేవారు యువతీ యువకులు. కాస్త అందమైన ఒక అమ్మాయిని చూసి ఒక యువకుడు తన ప్రక్కనున్న స్నేహితుడితో, "ఆశాపరేఖ్ లా వుందిరా." అని మెల్లిగా అంటే, రెండోవాడు, "రోజూ వస్తుందిగా, ఎవరి తాలూకో కనుక్కుందాం వుండు." అని ధైర్యం ఇచ్చేవాడు. పురాణం వింటే పుణ్యం వస్తుందనే నమ్మకం కల తల్లిదండ్రులు, వయసులో వున్న తమ పుత్రికలు, మరోకందుకు బయటకు వెళ్లడానికి సమ్మతింపకపోయినా, పురాణానికి వెళ్లడానికి అనుమతించేవారు. ఈవిధంగా, చాలా కాలం క్రింద విడిపోయిన ప్రేమికులు మళ్లీ ఒకర్నొకరు చూసుకునే అవకాశం కల్గింది. "మీ ఫ్రెండు గిరిజ, పురాణానికి వస్తోందిరా" అని, రాజాతో శేషగిరి చెప్పేశాడు. మరునాడే రాజా పురాణానికి హాజరై తన భక్తి శ్రద్ధల్ని ప్రకటించుకున్నాడు. అతనికి బాధ కలిగించిన విషయమల్లా గిరిజ ఒకర్తే కాక, ఒక ముసలావిడ కూడా ఆమె వెంట రావడం. ఈ ముసలి పీనుగ ఇంటి దగ్గర పడుండక, పురాణాని కెందుకో అని తిట్టుకున్నాడు.

గిరిజా, రాజాల ప్రణయగాథ రెండేళ్ల క్రింద ప్రారంభమై, మూణ్ణెల్ల క్రితం హఠాత్తుగా ఆగిపోయింది. గిరిజ, వ్యాపారస్థుడైన సుదర్శనంగారి అమ్మాయి. స్కూలుఫైనలు పాసవడంతో చదువాపేసినా ఇంట్లో ఉరికే కూచోలేక టైపు నేర్చుకోవడానికి ఇన్స్టిట్యూట్ కి వెళ్తూండేది. అదే సమయంలో, దారిలో ఒక పుస్తకాల కొట్టు దగ్గర రాజా అనే యువకు డొకడు, అందమైన టెరిలిన్ దుస్తులతో మెరుస్తూండేవాడు. అతని కళ్లు రోజూ గిరిజ కోసం ఎదురు చూస్తూండేవి. ఆమె రెండు జడలూ, రింగులూ, పరికిణీ మీద వోణీ, విశాలమైన కళ్లూ అతనికి పిచ్చి గాలి, తాగేసిట్లు అయిపోయి, ఆమె కన్పించకపోతే బ్రతకలేనని స్థితికి వచ్చేశాడు. గిరిజకు కూడా అందమైన ఆ ఇరవైయ్యేళ్ల యువకుడు తన కలల్ని ఆక్రమించుకుని, మనసులో ఎన్నో ఆశల్ని రేకెత్తిస్తూంటే, రోజూ ఆసమయం కోసం ఎదురు చూసేది.

దినదిన ప్రవర్ధమానమవుతున్న వారి ప్రణయానికి, గిరిజ అన్నగారొకడు విలన్ లా దాపురించి, గిరిజను టైపు నేర్చుకోవడానికి వెళ్లొద్దని ఆర్డరు వేశాడు. అప్పటి నుంచీ రాజా మనిషిలా లేడు. ఎప్పుడూ విచారంగా దిగులుగా వుంటూ, మళ్లీ గిరిజ ఎప్పుడు కన్పిస్తుందా అని ఎదురు చూశేవాడు. అలాటి ఆపత్కాలంలో సమయంలో దొరికిన అప్పులా పురాణం ఒకటి వచ్చి వారిద్దర్నీ కాపాడింది.


రాఘవశాస్త్రి గారి పురాణం విన్నవాళ్లకు ముఖ్యంగా తెలిసే అంశ మేమిటంటే, ఇప్పటి కంటే రామాయణ కాలంలోనే విద్యా, విజ్ఞానం, రాజకీయ పరిస్థితులూ, అన్నీ బాగా వుండేవనీ, ఇప్పుడు మనం నాగరికత చిహ్నములు అనుకునేవి, ఆ రోజుల్లో కోతులకు కూడా తెలిసి వుండేవనీ, అందువల్ల మనం పురోభివృద్ధి చెందుతున్నామనేది కేవలం అపోహ మాత్రమేనని. ఇప్పుడు 'షేక్ హాండ్' అనేది ఒక ఫాషను అనుకుంటున్నారు. కాని ఆనాడు రాముడూ, సుగ్రీవుడూ కలుసుకున్నప్పుడే షేక్ హాండు ఇచ్చుకున్నారట. ఈ కాలంలో స్నేహితులెవరైనా దూర ప్రయాణం చేస్తున్నా, రైల్లో వెళ్లిపోతున్నా, వారిని దూరం నుంచి చూసి జేబు రుమాల్నో, చేతులో ఊపడం, ఫాషనుగాను భావించబడుతోంది. కాని ఆనాడు హనుమంతుడు లంక నుంచి తిరిగి వస్తూంటే, కోతులు తమ తోకల్ని ఊపాయట కాబట్టి చేతులూపడం అనేది 'సిక్స్టీసిక్స్' (అరవైయారు) మోడల్ కాదనీ, రామాయణ కాలం నాటిదేనని చమత్కరించాడు. ఆనాడు ఇప్పట్లా మనిషి పదవును బట్టి, హోదాని బట్టి జీతాలిచ్చే పద్ధతి లేదట. మనిషి యొక్క కుటుంబాన్ని బట్టి ఇచ్చేవారట. అదే నిజమైన 'సోషలిజం' వ్యవస్థ అని

శాస్త్రిగారి అభిప్రాయం. ఈనాటి లిప్ స్టిక్కులూ, పౌడర్లూ ఆనాడు కూడా వుండే వని, సీతాదేవికి ఋషిపత్ని ఒకామె ఇటువంటి సౌందర్య సాధనలూ, చర్మ పోషకములగు వస్తువులూ ఎన్నో ఇచ్చిందని చెప్పేరు. ఈ నాడు విద్యుద్దీపాల్ని చూసి మురిసిపోతున్న మనం, రావణాసురుడు లంకలో వీధి దీపాల్నీ, ఇళ్ళ దీపాల్నీ కూడా, మణులతో ఏర్పాటు చేశాడనీ, వాటి కాంతి చాలా గొప్పదని తెలుసుకోవాలని అన్నారు.

శాస్త్రిగారి పురాణం వింటున్నకొద్దీ ప్రజలలో భక్తిశ్రద్ధలు హెచ్చసాగాయి. పురాణం చాలా శ్రద్ధగా వింటున్నారు జనం. కాని మంచి రసవత్తరంగా సాగే పురాణానికి, రెండుమూడు విఘాతాలు రోజూ వస్తూం టేవి. అందులో ఒకటి శివరావుగారు రోజూ వచ్చి చదివే విరాళాల పట్టిక. రెండవది గంగరాజుగారి ఉపన్యాసం. మంచి ఉత్సాహ పూరితంగా పురాణంచెప్పే సమయంలో, టక్కున ఆపించి, శివరావుగారు 'నేటి విరా ళాల వివరాలు' అని రూపాయి మొదలు విరాళిచ్చినా, వారిపేర్లు చదువుతుండేవారు. అదయ్యాక గంగరాజుగారు, అయిదు నిము షాలు మాత్రమే మాట్లాడుతాననీ, శాస్త్రి గారిని అందరూ విరివిగా సత్కారం చెయ్యా లని చెప్తాననీ, స్టేజి ఎక్కేవారు. పల్లెని, పెద్దదైన విగ్రహం, ఆయనది బక్కతలు, తెల్లటి పంచే చొక్కా వేస్తారు. స్టేజి ఎక్కాడో, ఒక పట్టాన దిగడు భక్తి, జ్ఞానం, వైరాగ్యం, అన్నిటి గురించీ, మాట్లాడి, ఆగకుండా నేను జోరు కొట్టి, 'మైకు' కోసం వాచిపోయిన వాడిలా ఎప్ప టికీ దాన్ని వదలక, చివరికి, 'కాబట్టి భక్తాదులు అంతా శాస్త్రిగారికి విరాళా లివ్వాలి' అని చెప్పి స్టేజి దిగిపోయ్యేవాడు పిల్లిఫ్లోర్ని చూసినకొద్దీ పుడక అనీ, రామా యణంలో పిడకలవేట, అని ప్రజలంతా అనుకునేవారు.

రోజూ పురాణానికి తల్లితో బాటు విధిగా గిరిజ వెళ్ళడం, ఆమె అన్నగారైన భీమా రావు గమనించాడు. సత్కాలక్షేపంలో కాలం గడపడం మంచిదేగాని, పురాణం వినడానికి, గిరిజ అంత పక్కాగా ఎందుకు ముస్తాబవు తోందో అతనికి అర్థంకాలేదు. ఒకనాడు తను కూడా పురాణం విందామని వెళ్ళాడు. అనాడు అసలు సంగతి బయట పడింది. ఆడవాళ్ళతో కూచున్న గిరిజ మాటిమాటికీ, మగవాళ్ళతో కూచున్న రాజా వైపు చూస్తూండడం, రాజా తమాషాగా నవ్వు తూండడం, ఆమె సిగ్గుతో తలవంచుకుని క్రీగంట అతనిని చూడడం, భీమారావు గమనించాడు. అతనికి వళ్ళు మండిపో యింది. హృదయం కుతకుత ఉడికిపో యింది. మర్నాటి నుంచీ గిరిజను పురాణా నికి వెళ్ళొద్దనగలడా? అది కుదరదే. 'ఎలాగ ఈ ప్రేమాన్ని అరికట్టడం?' అని తెగ ఆలోచించాడు. మర్నాడంతా యోచించాడు. ఇంకెక్కడికైనా వెళ్ళొద్దని అనగలడుగాని, దైవ సంబంధమైన పురాణానికి వెళ్ళొ ద్దంటే, తన తండ్రైన సుదర్శనంగారు ఊరుకోరే! ఎలా? రోజు రోజుకీ గిరిజా, రాజాల అనుబంధం పెరిగిపోతూంటే తను చూస్తూ ఎలా ఊరుకోగలడు? ఏమైనా సరే గిరిజను అదుపులో పెట్టాలి అని ఆలో చించగా ఆలోచించగా ఒక మంచి ఉపాయం తట్టింది. వెంటనే తండ్రి దగ్గరికి వెళ్ళి పురాణం గురించి తెగ పొగిడేసాడు. "నాన్నా మీరు తప్పకుండా వినితీరాలి. ఏం పురాణం! అద్భుతం! అద్భుతం!" అని తండ్రి ముందు పురాణాన్ని ఆకాశానికి ఎత్తేశాడు. "అలాగా అంతబాగా చెప్తున్నాడా! అయితే నేనూ వస్తాలే." అన్నారాయన. భీమారావు, కిమ్మనకుండా పురాణమంటేలా, గంటులేశాడు.

సుదర్శనంగారికి పురాణం వింటున్నంత సేపూ చాలా ఆనందం, తన్మయత్వం కలిగి




రాజాను గాని గిరిజనుగాని గమనించే శ్రద్ధ కలుగలేదు. భీమా రావు ఇది చూసి కంగారు పడ్డాడు. ఆరాత్రి మెల్లిగా తండ్రి దగ్గరకు చేరి, "తుంటరి వెధవలు కూడా పురాణానికి వస్తున్నారు నాన్నా! వాళ్ళనో కంట కని పెట్టాలి." అన్నాడు.

"ఎక్కడరా? నా కెవరూ కన్పించలేదు."

"మీ ఎడంచేతి వైపు, రెండు వరుసలకు ముందుగా ఒక రౌడీ కూచుంటున్నాడు. వాణ్ణి జాగ్రత్తగా చూడాలి. వాడు వెళ్ళాంట వైపు తెగ చూస్తున్నాడు." అని పూరిత పాడు.

"సరేలే. అలాటి పోకిరివేషాలేస్తే వెధవని పాతేస్తాను" అని తండ్రి హామీ ఇవ్వాక భీమారావు నిశ్చింతగా నిద్రపోయాడు.

మరునాడు రాజాకి గిరిజ కళ్ళల్లో ఏదో కొత్త సందేశం కన్పించింది. అంతేకాక తన వెనుక వరుసలో ఒకాయన తనవైపు తీక్షణంగా చూడడం కూడా కన్పించింది. 'దీని భావమేమి తిరుమలేశ' అని అతను మధనపడుతూంటే, గిరిజ ఆ సమస్యను పరి ష్కరించింది. ఆ అమ్మాయి కొంచెం సేపయ్యాక తండ్రి దగ్గరికి వెళ్ళి, "నాన్నా తాళాలిస్తారా, ఇంటికి వెళ్ళాలి." అంది. ఆయన తాళా లిచ్చాడు. రాజా వెంటనే ఆవ్యక్తి గిరిజ తండ్రని గ్రహించాడు.

పురాణానికి వచ్చే జనసంఖ్య రోజు రోజుకీ పెరుగుతోంది గాని శాస్త్రిగారికి అందు వల్ల వచ్చే ప్రతిఫలం ఎక్కువగా కన్పించటం, అసలాయన చాలా ఆర్థిక ఇబ్బందితో వున్నారు. ముఖ్యంగా వెంటనే తన పిల్ల పెళ్ళి చెయ్యాలి. అందువలన ఆ విషయం కొంతమంది పెద్దలతో కదుపగా వాళ్ళు, తగిన ప్రయత్నం చేస్తామని హామీ యిచ్చారు. మర్నాటి నుంచీ, పురాణం జరుగుతుంటే మధ్యమధ్య గంగరాజుగారూ, శివరావుగారూ ప్రజల్ని విరాళాలు బాగా ఇమ్మని ప్రార్థించ సాగారు. ముఖ్యంగా పోరటి పళ్ళెంలో డబ్బు బాగా వెయ్యాలని ప్రబోధించేవారు. రోజూ పళ్ళెంలో పాతికా, ముప్ఫై రాసాగింది.

సుందరకాండ చెప్తూంటే శాస్త్రిగారు ప్రజలలో భక్తి ప్రపత్తులు ఇనుమడించే టట్లు, విశేషార్థాలను బోధపరిచి విపులంగా

తామారయణ పారాన్ని తెలియజేశారు. హను మంతుణ్ణి జీవుడితో పోల్చేరు. లంకకు వెళ్ళి సీతను సందర్శించడంతో అతను విదుర్కొన్న కష్టాలన్నీ జీవుడు సంసారంలో విదుర్కొనే కష్టాలతో పోల్చారు. సీతను చూచి తిరిగి రాముడి వద్దకు వచ్చినప్పుడు. రాముడు హనుమంతుణ్ణి కౌగలించుకున్నాడు, అదే జీవ బ్రహ్మైక్యం అన్నారు శాస్త్రి గారు. ప్రజలంతా ఈ వివరణకు ముగ్ధు లయ్యారు సుందరకాండ చెప్పినంతసేపూ ఆయన గొప్ప తన్మయత్వంలో వున్నారు రోజూ ఆంజనేయ స్తుతి ప్రజలచే చేయించే వారు. సుందరకాండ పారాయణ చెయ్యటం వలన కలిగే ఫలితాల గురించి రెండురోజులు చెప్పారు. మొత్తం సుందరకాండ చెప్పడం పదిరోజులు పట్టింది. ప్రజలలో అది వింటూంటే ఉత్సాహం ద్విగుణీకృతమైంది

కాని శాస్త్రిగారి దిగులు కూడా ఎక్కు వైంది. గొప్ప సన్మానం జరుగుతుందనీ, వందల కొద్దీ చదివింపులు వస్తాయనీ ఆశిం చిన ఆయన 'ఇక పురాణం కొద్దిరోజులలో అయిపోతోంది కదా ఇప్పటివరకూ ఆ సూచన లేమీ లేవే' అని బాధపడ్డారు. తగిన కృషి ఆయన చేస్తూనే వున్నారు. పగలల్లా పెద్దపెద్ద వారిళ్లకు వెళ్లి, తన పురాణానికి రమ్మని చెప్తూనే వున్నారు. ఎక్కడో ఏదో లోటు జరుగుతోందనీ, రావలసిన వారు కొంతమంది రావటం లేదనీ ఆయన గ్రహించారు.

అందుకు కారణం కూడా ఆయనకు బోధపడింది. దీనికి పూనుకుంటున్న శివరావు గారన్నా, మొదట పురాణం తన యింట్లో చెప్పించిన సత్యంగారన్నా, పంచాయతీ ప్రెసి డెంటయిన రామయ్యగారికి కిట్టదు. అసలు రామయ్యగారూ, కృష్ణమనాయుడుగారూ పూనుకుని వుంటే శాస్త్రిగారికి చాలా ఘన మైన సత్కారం జరిగి వుండేదని చాలామంది అన్నారు. కాని ఇప్పుడది సాధ్యంకాదు. మళ్లీ కావాలంటె మరో నెలరోజులు పోయాక శాస్త్రిగారిని పిలిపించి తన ఆధ్వర్యంలో పురాణం చెప్పించి సత్కారం చేయిస్తామన్నారు కాని ప్రస్తుతంలో తనేమి సహాయం చెయ్య లేమని అన్నారు, అయినావాడు పురాణానికి శాస్త్రిగారి జనమంతం మీద వస్తూనే వున్నారు.

గ్రామంలో వుండే రాజకీయాలకూ, ముఠాతత్వాలకూ ఇటువంటి సత్కార్యం బలైపోతోందే అని మధ్యవర్తులూ, ఎక్కువ స్తోమతులేని పెద్దలంతా విచారించారు. అయినా శివరావుగారూ, సత్యంగారూ, గంగ రాజుగారూ గట్టి ప్రయత్నం చేసి విరాళాలు పోగుజెయ్యటం ప్రారంభించారు. రోజూ పురాణ సమయంలో శాస్త్రిగారు విరాళాల గురించి విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యంగా స్త్రీలకు ఆయన ప్రత్యేక విజ్ఞప్తి చేసే వారు. అనాడు రామదాసు, రాముణ్ణి ప్రార్థించి ప్రార్థించి, విసిగి, ఫలితం కనిపిం చక చివరికి, 'నన్ను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లీ' అని వేడుకున్నట్లు, శాస్త్రులుగారి పురాణానికి వచ్చే స్త్రీల నందరినీ వుద్దేశించి, వారందరూ తల్చుకుంటే తన కూతురి వివాహం వైభవోపేతంగా జరిగిపోతుందనీ, కాబట్టి ఉదారంగా విరాళాలు ఇప్పించమని కోరుతూండేవారు.

పురాణానికి హాజరవుతున్న స్త్రీలందరకూ శాస్త్రిగారంటే చాలా సదభిప్రాయం ఏర్ప డింది. వాల్మీకి, రామాయణంలోని ప్రతి పాత్రా ఎలా చిత్రించాడో, ఆయన సహేతు కంగా చెప్తూ, సీతామ్మవారి పాతివ్రత్యం, శ్రీరామచంద్రుల వారి ఏకపత్నీ వ్రతం గురించి చెప్తూ, లోకంలో ప్రతివారూ, ఆ మహోన్నత ఆదర్శాలను పాటించాలని విజ్ఞప్తి చేస్తూంటే స్త్రీలందరూ శాస్త్రిగారు కూడా అటువంటి మహోత్కృష్ట ఆదర్శా లతో జీవితం గడుపుతున్నారని విశ్వసించారు.

మొత్తానికి శివరావుగారి అవిరళ కృషి వలనా, గంగరాజుగారి అకుంఠిత భక్తి శ్రద్ధల వలనా, స్త్రీల కారుణ్య ప్రభావం వలనా, మరొక రెండురోజులలో పురాణం ముగిసిపోతుందనగా, సుమారు రెండువేలకు పైగా సొమ్ము సమకూరింది ఆ సొమ్మంతా శివరావుగారు జాగ్రత్త పరిచి, ఆఖరి రోజున శాస్త్రిగారికి సన్మానం చేయించి, ఇద్దామని సంకల్పించారు.

ఊరంతా ఈ విషయం తెలిసి చాలామంది సంతోషించారు. సుదర్శనంగారు ప్రతిరోజూ పురాణానికి హాజరవుతూనే వున్నారు ఒక నాడు ఆయన కొడుకును పిల్చి, "ఒరే నువ గిరిజకు మంచి సంబంధం చూశానురా. పిల్లవాడు చాలా బుద్ధిమంతుడు ఈరోజుల్లో అటువంటి కుర్రాళ్లుండరనుకో. ఏమి భక్తి! ఏమి శ్రద్ధా! రోజూ పురాణానికి హాజరవు తున్నాడు. పైగా నా ప్రక్కనే కూచుని నేనంటే ఎంతో గౌరవం చూపిస్తున్నాడు" అన్నారు సంతోషంగా. భీమారావుకి సందే హం వచ్చింది.

"ఎవరు నాన్నా అంత మంచి కుర్రాడు?" అని ప్రశ్నించాడు.

"ఎవరో రాజాట. వాళ్ల నాన్న కొక పుస్తకాల షాపుంది. సంబంధం నిశ్చయం చేశాను. త్వరలో ముహూర్తం పెట్టిద్దాం." అన్నారు.

"ఆ!" అన్నాడు భీమారావు ఆశ్చర్యంతో. తలుపు చాటు నుండి ఈ సంభాషణ విం టున్న గిరిజ, "అన్నయ్యా నువ్వు పురాణానికి రావాలిరా. తుంటరి కుర్రాళ్లు కొందరు నావైపు చూస్తున్నారు" అంది మెల్లిగా, గారంగా, వెటకారంగా. భీమారావు పళ్లు పటపట కొరుకుతూ, "నా కర్మ!" అంటూ అక్కణ్ణుంచి వెళ్లిపోయాడు. సుదర్శనం గారూ, గిరిజా నవ్వుకున్నారు.

అనాడే సన్మానం శివరావుగారు ప్రొద్దున్న తన యింటిలో కూచుని, గంధం తీస్తున్న భార్యతో మాట్లాడుతున్నారు పూజ కోసం గంధం తీస్తూ, ఆమె భర్తను, "ఈ గంధపు చెక్కకు చూడండి ఎంత సువాసనబ్బిందో" అంది. శివరావుగారు, "అంతా పూర్వజన్మ పుణ్యం. మనుష్యులతో కూడా మాటు. దైవభక్తి, సచ్ఛీలం, అనే మంచిగుణాలు నిలా అబ్బుతాయో. మన శాస్త్రులుగార్ని చూడరాదూ, ఏమి పాండిత్యం! ఏమి భక్తి! ఏమి గుణం!" అని పొగిడారు. స్నానం పూజా తొందరగా కానిచ్చి సన్మానానికి తగిన ఏర్పాట్లు చెయ్యడానికి హడావుడిగా దుస్తులు ధరించి, ఇంట్లోంచి బయల్దేరుతూంటే పోస్టుమాన్ ఎదురయ్యాడు.

ఆయన కొక ఉత్తరం ఇచ్చి పోస్టుమాన్

వెళ్ళిపోయాడు. అది ఆయన గుమ్మంలో ఉత్తరం. దాన్ని ఆయన చదువుకున్నారు. అందులో ఇలా వుంది:

అయ్యా,

నేను మీ వూరిలో కొన్నాళ్ళుగా పురాణం చెప్తున్న శాస్త్రిగారి భార్యను. మీ వూళ్ళో ఆయన పురాణం బాగా జరిగిందనీ, సుమారు రెండువేల రూపాయలు వసూలయ్యాయనీ తెలిసింది. ఈ సందర్భంలో మా కుటుంబ పరిస్థితిని మీకు తెలియజేసి, మిమ్మల్నొక ప్రార్థన చేసే సంకల్పంతో ఈ వుత్తరం రాస్తున్నాను. నన్ను మీ తోబుట్టువుగా భావించి, తగిన సహాయం చెయ్య ప్రార్థన.

మాకు ముగ్గురు కుమార్తెలు. అందులో పెద్దదాని వయస్సు పదహారు సంవత్సరాలు. దాని పేరు కౌసల్య. దాని వివాహం గురించే శాస్త్రిగారు మీ అందరి సహకారం అర్థించి వుంటారు. మీరు ఉదార బుద్ధితో రెండువేల రూపాయలు విరాళం ఇస్తున్నారు. కాని ఒక్క మనవి. ఈ సొమ్ము ఆయన చేతిలో పడిందంటే మాత్రం. అది ఆ పనికి వినియోగం కాదు. ఎందువల్లనంటే శాస్త్రిగారికి, అగ్నిసాక్షిగా వివాహమాడిన నన్ను గాని, మా బిడ్డలనుగాని పోషించాలని గాని మా మంచిచెడ్డలు చూడాలనిగాని కోరిక లేదు.

వారికి చాలాకాలం నుండి వేరొక స్త్రీతో సంబంధం వుంది. అందువలన వారికి చేతికందిన సొమ్మంతా ఆమె పరమై పోతుంది. నేను వారి ఆనందానికి గాని అభిప్రాయాలకుగాని అడ్డు వచ్చేదానను గాను నా యొక్క, నా బిడ్డల యొక్క జీవితం, యజమానియొక్క అలక్ష్యం వలన ఎన్ని అగచాట్లకు గురవుతున్నా, నలుగురిలో బయటపడవలసిన దానను కాను. కాని అయ్యా, ఆడపిల్ల వివాహం కోసమని పోగు చేసిన సొమ్మును, అందుకే వినియోగపడే టట్లు చెయ్యమని మిమ్మల్ని అర్థిస్తున్నాను.

ఇట్లు,
సుభద్ర.

అని వుంది. అది చదువుకొని, అందులో వివరింపబడిన ఒక స్త్రీ యొక్క కన్నీటి గాథను అర్థం చేసుకుని, 'ఓరి, అప్రాచ్యుడా!' అనుకున్నారు శివరావుగారు. ఈ విషయంలో లోపలికివచ్చి, భార్యతో చెప్తూంటే, అయిదేళ్ళ మనవడు గంధపు చెక్కని తీసికెళ్ళి పొయ్యిలో పెట్టడం, అది కాల్తూంటే సంతోషపడడం గమనించారు. భార్య, 'అయ్యో, అదేం పనిరా!' అని తియ్యడానికి వెళ్తూంటే, శివరావుగారు 'మంచి సువాసన వెదజల్లుతేనేం, దాని జాతి స్వభావం కాలడం కదా. అది కేవలం ఒక కర్ర ముక్క! భగవంతుడు సువాసన ప్రసాదించాడు. అంతే గాని దాని జాతిగుణం మార్చలేదు.' అనుకున్నారు. ఎన్ని పురాణాలు చెప్పినా, ఎంత గొప్ప నీతి వాక్యాలు బోధించినా అవన్నీ గంధపు చెక్కకు అబ్బిన సువాసనలు లాటివే, మానవుడిలోని సహజమైన బలహీనతలను పోగొట్టలేకపోయాయి కదా శాస్త్రిగారి విషయంలో' అనుకున్నారు శివరావుగారు.

ఆనాటి సాయంకాలం శాస్త్రిగారికి మంచి సన్మానం జరిగింది. ఊరిలోని పలువురు పెద్దలు ఆయన పురాణాన్ని ప్రశంసించారు. చాలామంది జనం వచ్చారా సభకి. చివరకు విరాళాలుగా సేకరింపబడిన సొమ్మును ఆయనకు అందజేసే సమయం వచ్చింది. అప్పుడు శివరావుగారు లేచి, "శ్రీ శాస్త్రిగారికి ప్రజల వద్ద నుండి వసూలైన విరాళాల మొత్తం రెండువేల రెండువందలు. ప్రస్తుతం శాస్త్రిగారి కుమార్తె వివాహం కోసమని ఈ సొమ్ము ఉద్దేశింపబడింది. కాబట్టి, అందులో రెండువేల రూపాయల్ని శాస్త్రిగారి కుమార్తె పేర బ్యాంకులో 'డిపాజిటు' చేసేసాను. మిగిలిన రెండువందలూ శాస్త్రిగారి ఖర్చుల నిమిత్తం ఇస్తున్నాము" అని రెండువందల రూపాయలు శాస్త్రిగారి కిచ్చారు.

శాస్త్రిగారి మొహంలోని భావం ఆనందమో, విచారమో ఎవరూ కనుక్కోలేక పోయారు. సభ చాలా జయప్రదంగా ముగిసింది. ●

